సాక్షి
మంచిర్యాల

బుధవారం ׀ 3 ׀ జూలై ׀ 2024



ట్రిపుల్ ఐటీకి తగ్గిన పోటీ
బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు పోటీ తగ్గింది. ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య సగానికి పడిపోయింది. నేడు ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల కానుంది. 8లో



పడవ ప్రయాణమే దిక్కు
ప్రాణహిత నది దాటేందుకు ప్రజలకు పడవ ప్రయాణమే దిక్కయింది. ఎగువ ప్రాంతంలో వర్షాలతో నదిలో నీటి ప్రవాహం పెరిగి కాలినడక బంద్ అయింది. 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0 /27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా ఈదురుగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయవాది పరిషత్ జిల్లా కార్యవర్గం



జిల్లా అధ్యక్షుడు దేగ రవీందర్



జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

మంచిర్యాలక్రైం: న్యాయవాది పరిషత్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక మాధవ నిలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యాయవాది పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దేగ రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తుల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా సాగే గురువయ్యా, ఎస్.లక్ష్మీరాజం, రాంబో, కార్యదర్శులుగా ఇల్లా వెంకటేష్, వేలుముల సతీష్, జైపాల్‌రెడ్డి, మహిళా రిప్రజెంటిటివ్‌గా సుమలత, కోశాధికారిగా సురేందర్ చారి, జాయింట్ సెక్రెటరీలుగా నరేందర్, నటేశ్వర్, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు చేయడానికి పరిషత్ ముందుంటుందని తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి




కోటపల్లిలో మొక్కను నాటిన కలెక్టర్ కుమార్‌దీపక్

కోటపల్లి: మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 75వ వన మహోత్సవంలో భాగంగా మంగళవారం కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలెక్టర్ కుమార్‌దీపక్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20లక్షల మొక్కలు నాటాలని ఆదేశించారు. మొక్కలు నాటుతూ ఒక ఉద్యమంలా చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కను నాటి వనమహోత్సవానికి ఊతమవ్వాలని సూచించారు. అనంతరం మొదటిసారిగా కోటపల్లికి వచ్చిన కలెక్టర్‌ను ఎంపీపీ, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, అదనపు డీఆర్‌డీవో దత్తారాం, ఎంపీడీవో భూమన్న, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో బాలయ్య, ఉపాధ్యాయులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు జిల్లా విద్యార్థుల ఎంపిక

మంచిర్యాలటౌన్: రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థుల వివరాలను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో చెన్నూరు నుంచి బండారి రక్షిత్, రామకృష్ణాపూర్ నుంచి కండె మిస్‌రనత్, మందమర్రి నుంచి చిట్టి అయాన్, దాసరి సుశాంత్, నస్పూర్ నుంచి కొండర శివ, రామకృష్ణాపూర్ నుంచి దంబెటి ఆయాన్, ధర్మారం నుంచి చొప్పదండి అయాన్‌స్వర్య, బాలికల నుంచి తాండూరుకు చెందిన గోమాల హస్వి, బెల్లంపల్లికి చెందిన కొండ ఆధ్య, రామకృష్ణాపూర్ నుంచి ఆరం శ్రీనిత్య, మందమర్రి నుంచి అంగల శ్రీకృతి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్‌కార్డు, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, కుల ధ్రువీకరణ పత్రం రెండు సెట్ల జిరాక్సు కాపీలు, ఐదు ఫొటోలతో నేరుగా ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9963539234 నంబరులో సంప్రదించాలని, విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు వెళ్లాలని కోరారు.

పోలీసుస్టేషన్లలో డీసీపీ తనిఖీ



డీసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ

బెల్లంపల్లి: పట్టణంలోని పోలీసుస్టేషన్లను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఏఎంసీ ఏరియాలోని ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించి, పక్కనే ఉన్న బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయం, తాళ్లగురిజాల పోలీసుస్టేషన్, వన్‌టౌన్, టూటౌన్‌లను తనిఖీ చేశారు. అంతకు ముందు డీసీపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఏసీపీ, సీఐ, ఎస్సైలు స్వాగతం పలికారు. ఏసీపీ ఏ.రవికుమార్, బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలొద్దీన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, ఎస్సైలు నరేష్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

కొత్త బడికి దారేది..!

- బదిలీ అయినా పాత పాఠశాలల్లోనే విధులు
- సింగిల్ స్కూల్ టీచర్ల ఆశలపై నీళ్లు
- మిగిలిన పదోన్నతులపై వివరాల సేకరణలో విద్యాశాఖ



హరిజనవాడ, రాళ్లపేట్ పాఠశాల భవనం ఇదే..

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులకు బదిలీ ఆర్డరు చేతికందినా పాత స్థానం నుంచి రిలీవై కొత్త చోటుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తూ కోరుకున్న పాఠశాలకు బదిలీ అయిందన్న ఆనందం లేకుండా పోయింది. 612మంది ఎస్జీటీలకు బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంటనే కొత్త స్థానంలో చేరాల్సి ఉంది. జిల్లాలోని పలు పాఠశాలల్లో మెజార్టీ ఉపాధ్యాయులకు సబ్‌స్టిట్యూట్ లేకపోవడంతో వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

- మంచిర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(హరిజనవాడ)లోని ఇద్దరు ఉపాధ్యాయులు పదోన్నతిపై మరో స్కూల్‌కు వెళ్లారు. ఆ పాఠశాల బాధ్యతలను అదే ఆవరణలో నిర్వహిస్తున్న రాళ్లపేట్ స్కూల్ టీచర్‌కు సర్దుబాటు చేశారు. రాళ్లపేట్ స్కూల్‌లో 16మంది, హరిజనవాడ పాఠశాలలో 38మంది విద్యార్థులు చదువుతున్నారు. బదిలీల నేపథ్యంలో ఇతర పాఠశాలల నుంచి ఇద్దరు టీచర్లు రావడానికి ఆప్షన్ ఎంచుకున్నారు. ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ అయినట్లే అనుకున్నా రేషనలైజేషన్ నిబంధనలు బదిలీపై వచ్చే ఉపాధ్యాయులకు అడ్డు రావడంతో రెండు పాఠశాలల భారమంతా ఒకే ఉపాధ్యాయుడిపై పడుతోంది.
- హాజీపూర్ మండలంలోని కాంప్లెక్స్ హెచ్‌ఎం పరిధిలో తొమ్మిది మంది ఉపాధ్యాయులు బదిలీపై రాగా ఇద్దరు మాత్రమే కొత్త పాఠశాలలో చేరారు.
- వేమనపల్లి మండలంలో 40మందికి పైగా ఇతర పాఠశాలలకు వెళ్లేందుకు బదిలీల్లో అవకాశం లభించింది. ఇతర మండలం నుంచి వేమనపల్లి మండలంలోని పాఠశాలకు ఒక్కరు మాత్రమే బదిలీపై రావడంతో ఇక్కడ ఎక్కువ మంది రిలీవ్ కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఇద్దరు టీచర్లు ఉన్న పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఎక్కువ మంది ఉన్న టీచర్ల పాఠశాలల నుంచి ఎనిమిది మంది మాత్రమే రిలీవ్ కాగా.. 32మందికి పైగా టీచర్లు కొత్త పాఠశాలలకు వెళ్లకుండా పాత బడిలోనే బోధించాల్సిన పరిస్థితి ఎదురైంది.
- జిల్లాలో 113 సింగిల్ టీచర్ల స్కూళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల మండలంలో బదిలీ అయిన ఒక ఉపాధ్యాయుడు కూడా సబ్‌స్టిట్యూట్ లేక కొత్త పాఠశాలలకు వెళ్లలేకపోయారు. వేమనపల్లి మండలంలోనే 18 నుంచి 20 మంది సింగిల్ టీచర్లు ఉండగా బదిలీ అయినా వారిని రిలీవ్ చేయాలంటే వారికి బదులుగా ఆ పాఠశాలకు మరో ఉపాధ్యాయుడు రావాల్సి ఉంది. ఇలా ప్రత్యామ్నాయ(సబ్‌స్టిట్యూట్) ఉపాధ్యాయులు వచ్చే వరకు పాత పాఠశాలల్లోనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

మిగిలిన పదోన్నతి పోస్టులపై ఆరా..

ఒకే ఉపాధ్యాయుడు ఓ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, మరో పాఠశాల పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతులు(డ్యుయల్) పొందారు. ఇందులో పీఎస్‌హెచ్‌ఎంను వదులుకుని ఎస్‌ఏ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పీఎస్‌హెచ్‌ఎం పోస్టు ఖాళీగా మిగిలింది. డ్యుయల్ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల వివరాలపై విద్యాశాఖ ఆరా తీస్తోంది. ఇటీవల జరిగిన ఎస్‌ఏ పదోన్నతులు, పీఎస్‌హెచ్‌ఎంలు ఖాళీ అయిన పోస్టులపై నిమగ్నమైంది. బదిలీల ప్రక్రియ ముగియడంతో ఖాళీ పదోన్నతుల వివరాలు సేకరిస్తోంది. గత ప్రమోషన్ జాబితాలో కటాఫ్ అయిన తర్వాత మిగిలిన వారిలో 1:2 పద్ధతిన సీనియార్టీ జాబితా రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పోస్టుకు సరిపడా అర్హతలున్నాయా..? అని ఉపాధ్యాయుల నుంచి ఫోన్ల ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన పదోన్నతుల పోస్టులు భర్తీ ఎప్పుడు..? ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత కరువైంది.

మూత 'బడి'నట్టేనా..?

జిల్లాలో విద్యార్థులు లేకపోవడంతో 31 సర్కారు పాఠశాలలు మూతపడ్డాయి. ఇందులో 19 పాఠశాలల్లో టీచర్లు ఉండి పిల్లలు లేకపోవడంతో ఇతర పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పిల్లలు లేకుండా టీచర్లు ఉన్నా పాఠశాలల పోస్టులను చూపకపోవడం.. ఆ పాఠశాలల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను తప్పనిసరిగా విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. దీంతో ఆ పాఠశాలలు శాశ్వతంగా మూతబడినట్లేనని తెలుస్తోంది. ఒకవేళ టీచర్లు ఉండి పాఠశాలలు తెరువాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఈ ఏడాది మూసివేసిన బడుల్లో చెన్నూర్ మండలంలో లక్ష్మీపూర్ పాఠశాల మాత్రమే తెరిచారు. మరో పాఠశాల ఎంపీపీఎస్ సుబ్బారాంపల్లి తెరిచేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇంతలోనే అక్కడ పనిచేస్తున్న టీచర్‌ను రిలీవ్ చేశారు. పాఠశాలలకు పిల్లలు వచ్చినా బోధించే ఉపాధ్యాయుని కోసం వెతకాల్సిన పరిస్థితి. ఇంకోవైపు ఎంతమంది పిల్లలున్నా పాఠశాలలు నడపాలని.. ఇందుకు అవసరమైన ఉపాధ్యాయులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. మూసివేసిన బడులను తెరిపించేందుకు కసరత్తు చేస్తూనే పిల్లలు లేరనే పాఠశాల పోస్టును చూపకుండా టీచర్లను బదిలీ చేయడం వెనక ఆంతర్యమేమిటో అంతుచిక్కకుండా పోతోంది. ఒకవేళ పిల్లలు వచ్చి మూసివేసిన పాఠశాలను తెరిస్తే వీవీల నియమించడం.. సర్దుబాటు చేయడం తప్పదేమో.

డయేరియా నియంత్రణపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- అవగాహన పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో అనిత, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాకాలంలో డయేరియా ప్రబలకుండా 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.అనితతో కలిసి డయేరియా అవగాహన కార్యక్రమాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు ఆగస్టు 31 వరకు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య, విద్య, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పురపాలక సంఘాలు, నీటి పారుదల శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటిని సందర్శించి ఐదేళ్లలోపు పిల్లల వివరాలు సేకరించాలని, నీటి విరేచనాల సమస్య ఉన్నట్లయితే ఓఆర్ఎస్ ద్రావణం, వయసు వారీగా జింక్ మాత్రలు, చికిత్స అందించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో పిల్లలకు భోజనం చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేయాలని, అతిసార రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చదువుతోనే విద్యార్థులకు భవిష్యత్



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్, నాయకులు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్
- సీఓఈ విద్యార్థులకు సన్మానం

బెల్లంపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని చదవాలని, చదువుతోనే భవిష్యత్ ఉంటుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం సీఓఈ గురుకుల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఐఐటీలో సీటు సాధించిన గురుకుల విద్యార్థులు గట్టు శ్రీహర్ష, తేజావత్ సిద్దులకు శాలువా కప్పి సన్మానించారు. విద్యాలయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ సైదులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు దావ రమేష్, నాతరి స్వామి, ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు వేదిక ప్రారంభం

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ రైతు వేదికను ఎమ్మెల్యే వినోద్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన 37మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ తంగళ్లపల్లి వాసులకు పట్టాలు ఇప్పించాలని మాజీ సర్పంచ్ ఇందూరి భూమయ్య, రైతులు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు మాధవరపు నర్సింగరావు, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, సాబీర్‌అలీ, ఎంపీటీసీలు సంతోష్‌కుమార్, హరీష్‌గౌడ్, వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాసిపేట: గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాసిపేటలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు దీపక్, నాయకులు మురళి, రాజన్న, కరీం, సత్యనారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.

బాల కార్మికుల సమాచారం ఇవ్వండి




వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో అనిత, అధికారులు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు
- ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్ల విడుదల

మంచిర్యాలక్రైం: బాల కార్మికుల వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. బాలకార్మికల సంరక్షణకు ప్రత్యేక చర్యల్లో భాగంగా మంగళవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, విద్యాశాఖ సీడబ్ల్యూసీ, వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గతంలో నమోదైన కేసుల డేటా ఆధారంగా పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న హాట్‌స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. గతంలో రెస్క్యూ చేసిన పిల్లల పరిస్థితి ఎలా ఉంది, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయాలని సూచించారు. బడి బయట పిల్లలు, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని అన్నారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేని పిల్లలకు ఆసుపత్రుల్లో వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని ప్రతీషాపు, కర్మాగారాల వద్ద 'నో చైల్డ్ లేబర్ ఆర్ ఎంప్లాయ్' బోర్డులు పెట్టించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతీ డివిజన్‌లో ఒక ఎస్సైతోపాటు మరో నలుగురు సిబ్బందిని నియమించామని, వీరితోపాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహిద్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, డీఎంహెచ్‌ఓ అనిత, ఆపరేషన్ ముస్కాన్ టీమ్ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, నాయకులు

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఎస్ఆర్పీ1, ఎస్సార్పీ 3, 3ఏ గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే విధంగా బొగ్గు బ్లాకులను వేలం వేసి ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. ఈ నెల 12 వరకు నిరసనలు చేపడుతామని, మిగతా కార్మిక సంఘాలు కూడా కలిసి వచ్చి సమష్టిగా పోరాడి కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఎన్నికలకు ముందు వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేలం ప్రక్రియకు మద్దతు తెలుపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శులు మురళి చౌదరి, దాడి రాజయ్య, మోతె లచ్చన్న, అంబాల రవి, మారుపెల్లి సారయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

అలైన్‌మెంటు మారుస్తారా?

- ఎన్‌హెచ్–63 ప్లాన్‌పై వినతులు
- భూ సేకరణపై నిర్వాసితుల ఆందోళన
- మరోసారి మార్పు చేయాలంటూ పట్టు



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, రఘునాథ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ వైపు వెళ్లే జాతీయ రహదారి–63 విస్తరణలో అలైన్‌మెంటు మార్పు కోసం భూ నిర్వాసితుల పోరాటం కొనసాగుతోంది. జిల్లా పరిధిలోని లక్సెట్టిపేట నుంచి హాజీపూర్ మండలం ముల్కల్ల వరకు నిర్మించనున్న రహదారితో రైతుల భూములపై అభ్యంతరాలు వస్తున్న విషయం తెలిసిందే. మొదటిసారిగా ప్రతిపాదించిన అలైన్‌మెంటునే ఖరారు చేయాలంటూ నిర్వాసితులు జిల్లా కేంద్రంతోపాటు జాతీయ రహదారిపై పలుమార్లు నిరసనలు వ్యక్తం చేశారు. కలెక్టర్, జాతీయ రహదారి పీడీ ఆఫీసు ముందు నిరసనలు చేపట్టారు. తాజాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాజీ ఎంపీ వెంకటేష్‌తో కలిసి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి అలైన్‌మెంటుపై పునఃసమీక్షించాలని కోరారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయారని, ప్రస్తుతమున్న రోడ్డునే నాలుగు వరుసలకు మార్చాలని విన్నవించారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణంపై అభ్యంతరాలు కొనసాగుతున్నాయి.

భూ సేకరణ జరిగితేనే ముందుకు

జాతీయ రమదారి నిర్మాణ పనుల్లో ఇప్పటికే జాప్యం జరుగుతుండగా భూ సేకరణ జరిగితే ముందుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, భవిష్యత్‌లో మరింత ట్రాఫిక్ పెరగనుంది. మరోవైపు నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతంగా గుర్తించారు. నాలుగు వరుసల దారి నిర్మితమైతేనే ఇటు ఎన్‌హెచ్–363కి అనుసంధానంతో ఒత్తిడి తగ్గనుంది. నిర్వాసితులకు సరైన పరిహారం పొందడంలో సంతృప్తి చెందకపోతే జాప్యం జరగనుంది. అంతేకాక తమ భూముల్లో సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను సైతం అడ్డుకున్నారు. మరోవైపు వంద రోజుల ప్రధాని మోదీ ప్లాన్‌లో జాతీయ రహదారిని చేర్చడంతో వెంటనే పనులు ప్రారంభించాలనే తలంపుతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ముందుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ పూర్తయితేనే రైతుల నుంచి భూములు ఎన్‌హెచ్‌ఏఐకి బదలాయింపు జరుగుతుంది. ఆ తర్వాతే కాంట్రాక్టరుతో నిర్మాణ ఒప్పందం జరగనుంది. ఆర్మూర్–మంచిర్యాల సెక్షన్‌లో మొత్తం సేకరించాల్సిన భూమిలో ప్రభుత్వ, అటవీ భూములు మినహా 1259.42ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల నుంచే తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో నిర్వాసితులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేకపోవడం, అలైన్‌మెంటు మార్పులపై అభ్యంతరాలు వ్యక్తం అవుతుండడంతో మరింత జాప్యం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి మార్పులేదని చెబుతున్నారు.

పునఃసమీక్షించాలి

మంచిర్యాలటౌన్: ఆర్మూర్ నుంచి మంచిర్యాల మధ్య జాతీయ రహదారి–63 నాలుగు వరుసలగా విస్తరణ పనుల అలైన్‌మెంటును పునఃసమీక్షించాలని పెద్దపల్లి మాజీ ఎంపీ బి.వెంకటేష్‌నేత, మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంగళవారం ఢిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. లక్సెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం ఖరారు చేసిన అలైన్‌మెంట్‌పై మరోసారి నిర్ణయం తీసుకోవాలని, రైతులు నష్టపోకుండా రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో గోదావరి తీరం వెంట గ్రామాల ప్రజలు భూములను కోల్పోయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విస్తరణ చేపట్టాలని విన్నవించారు. లక్సెట్టిపేటలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండగా, బైపాస్ రోడ్డును నిర్మించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటపలుకుల తిరుపతి, పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పోషక ఆహారం అందించాలి



భోజనం పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

మంచిర్యాలఅర్బన్: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతీ రోజు మెనూ ప్రకారం పోషక విలువల ఆహారాన్ని అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో దోమల వల్ల డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వంటగది, స్టోర్‌రూమ్ తాగు నీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

లెక్కల పాఠాలు విని.. ప్రశ్నలు అడిగి..

బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీవో పదో తరగతి గదిలో టీచర్ బోధిస్తున్న లెక్కల పాఠాలు విన్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదనపు తరగతి పనులు పనులు వేగవంతం చేయాలని అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఆరా తీశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో మల్లారెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి తగ్గిన పోటీ

- ఈ ఏడాది సగానికి పడిపోయిన దరఖాస్తులు
- వర్సిటీలో సమస్యలే కారణమంటున్న విద్యావేత్తలు
- నేడు ఎంపిక జాబితా విడుదల
- మెరిట్ విద్యార్థులకు సీట్లు
- ఈ ఏడాదైనా సమస్యలు లేకుండా చదువులు సాగేనా?



బాసర ట్రిపుల్ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్ఐటీలో 2024–25 విద్యా సంవత్సరంలో 1500 సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా జూన్ 1 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా విద్యార్థుల జాబితాను రూపొందించారు. మెరిట్ విద్యార్థుల జాబితాను బుధవారం క్యాంపస్‌లో విడుదల చేయనున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న వివరాలు బుధవారం వెల్లడిస్తామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. గతంలో వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఎప్పటికప్పుడు తెలిపేవారు. కానీ ఈ సారి ఆ సంఖ్య వివరాలను గోప్యంగా ఉంచుతూ దాదాపుగా 15 వేలు వచ్చాయని చెప్తున్నారు. దరఖాస్తుల సంఖ్య వివరాలు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారనే విషయం తెలియడం లేదు.

విద్యావిధానం...

ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ ఆధారంగా బాసర ట్రిపుల్ఐటీలో బోధన కొనసాగుతుంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సును నేర్పిస్తారు. అనంతరం మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజనీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్ఐటీ అధికారులు ప్రభుత్వం తరఫున వసతులు కల్పిస్తారు. ల్యాప్‌టాప్, ఒకే రకమైన దుస్తులు, షూస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి కల్పిస్తారు.

పర్యవేక్షణ కరువు...

అంతా బాగున్న బాసర ట్రిపుల్ఐటీలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. అన్ని శాఖల్లో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ చదివే విద్యార్థులు సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. స్టూడెంట్ కమిటీని కూడా ఎన్నుకోకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రిపుల్ఐటీలో ఏంజరిగినా బయటకు చెప్పకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఏ విషయం బయటకు వచ్చినా అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అక్కడంతా బాగుంటే బయట సమాజానికి ఏం చెప్పకపోయినా నష్టమేం ఉండదు. కానీ హాస్టల్ వసతి మొదలుకుని భోజనాల వరకు విద్యార్థులు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. హాస్టల్ గదుల్లో, చాలా చోట్ల పెచ్చులూడుతున్నాయి. రంగులు లేక భవనాలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లు సరిచేయడం లేదు. చాలా చోట్ల హాస్టల్ గదులకు నీళ్లు రావడం లేదు. ఫ్యాన్‌లు తిరగడంలేదు. ఫర్నిచర్ సరైన రీతిలో లేదు. ఇక మెస్‌లలో భోజన వసతి అయితే చెప్పాల్సిన అవసరం లేదు. మరోవైపు సరిహద్దు మహారాష్ట్రలో ఉన్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీ దుర్గంధం క్యాంపస్‌ను కమ్మేస్తుంది. విష వాయువులతో నిండిన గాలినే విద్యార్థులు పీలుస్తున్నారు. ఎంతో మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల నిరవధిక నిరసనలతో అప్పటి మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ క్యాంపస్‌కు వచ్చి విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. కానీ ప్రభుత్వం మారినా ఇక్కడి సమస్యలు మాత్రం తీరలేదు. ట్రిపుల్ఐటీ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ట్రిపుల్ఐటీ సమస్యలు లేకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు ఎంపిక...

గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థుల జీపీఏ, సా మాజిక వర్గం, ఇలా అన్నింటినీ లెక్కలోకి తీసుకుని సీట్లు కేటాయించనున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారుల బృందం పూర్తిస్థాయిలో ప ర్యవేక్షించింది. ఇందులో మెరిట్ ఆధారంగా సీట్ల కే టాయింపు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తామని, ఆన్‌లైన్‌లో వివరాలు ఉంచుతామని అధి కారులు పేర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా ట్రిపుల్ఐటీ విడుదలచేసే జాబితా కోసం ఎదురుచూస్తున్నారు. జాబితా విడుదలైతే ట్రిపుల్ఐటీలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరయ్యేందుకు విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

గతంతో పోలిస్తే...

బాసర ట్రిపుల్ఐటీకి మూడేళ్లుగా వచ్చిన దరఖాస్తులను పోల్చిచూస్తే ఈ ఏడాది అధికారులు చెప్పిన సంఖ్య సగానికి తగ్గిందనే చెప్పవచ్చు. 2020–21లో 32 వేలు, 2021–22లో 20,178, 2022–23లో 31,432, 2023–24లో 32,635 దరఖాస్తులు వచ్చాయి. కానీ ఈ విద్యాసంవత్సరంలో కేవలం 15వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బాసర ట్రిపుల్ఐటీలో సీట్ల కోసం గతంలో వందలాది మంది విద్యార్థులు పోటీపడేవారు. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులను బట్టిచూస్తే ఒక్కో సీటుకు పది మంది మాత్రమే పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

గంజాయి కేసులో పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు నిచ్చారు. జైనూర్ సీఐ అంజన్న తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దినకర్ సునీల్ 2021 ఆగస్టు 27న ఆటోలో 25 కిలోల 300 గ్రాముల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. అప్పటి ఐఓలు తిరుపతి, హనూక్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్‌రావ్ సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

దాడికి యత్నించిన నలుగురిపై కేసు

మందమర్రిరూరల్: మందమర్రికి చెందిన కొమ్ము రాజేశ్‌పై దాడికి యత్నించిన నలుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పట్టణానికి చెందిన లౌడం రాజ్‌కుమార్, కొమ్ము రాజేశ్‌కు మధ్య కొంతకాలంగా భూవివాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై మాట్లాడుకునేందుకు రాజేశ్ రమ్మని చెప్పడంతో రాజ్‌కుమార్ కోపంతో అతని ఇంటికి వెళ్లాడు. అతను కనిపించకపోవడంతో సీసీ కెమెరా పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దాడికి యత్నించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజ్‌కుమార్ అలియాస్ సది, అరుణ్, ముజాయిద్, భీంసేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు



అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థి

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సింగరేణి మేనేజ్‌మెంట్ కోటా కింద మంగళవారం అడ్మిషన్లు తీసుకున్నారు. కార్మికులు, రిటైర్డ్ కార్మికుల పిల్లలకు కాలేజీలో కేటాయించిన వివిధ కోర్సుల్లోని 150 సీట్లకు కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఇంద్రవెల్లి: గత నెల 11న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరపూర్ గ్రామానికి చెందిన కోట్నాక్ ఆనంద్‌రావ్, గిరిజబాయి దంపతుల కుమారుడు కోట్నాక్ మహేందర్ (17) ఇంద్రవెల్లిలోని క్రీసెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 11న బైక్‌పై ఇంద్రవెల్లి నుంచి గౌరపూర్ వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

'తల్లిదండ్రుల పోరాటంలో భాగస్వామ్యం కావాలి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు చేస్తున్న పోరాటంలో పిల్లలు భాగస్వామ్యం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) రాడికల్స్ పేరుతో మంగళవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేసింది. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణతో భవిష్యత్ చీకటవుతుందని, ఓపెన్ కాస్టులతో గ్రామాలు వల్లకాడుగా మారుతున్నాయని, పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని పేర్కొన్నారు.

బడికి రోడ్డు వేయించిన అధికారులు



రోడ్డు పనులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి ప్రాథమిక పాఠశాల చుట్టూ మురుగునీరు నిలిచి ఉండడంతో బడికి వెళ్లేందుకు దారిలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా 'మురుగులోనే బడి చదువులు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీవో సత్యనారాయణ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేలా మట్టితో తాత్కాలిక రోడ్డు వేయించారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: వర్షాకాలం సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందువల్ల కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో సివిల్ డిపార్టుమెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మురుగునీరు, వర్షపు నీరు నిలువకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్మికులకు పరిశుద్ధమైన మంచినీటిని సరఫరా చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన పారిశుధ్య పనులనుపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏరియా ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఇన్‌చార్జి డీజీఎం సివిల్ రాము, ఈఈ సత్యనారాయణ, వైద్యులు లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నామమాత్రపు ధరలకే మొక్కలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఐటీడీఏ పరిధిలోని 4 ఉద్యాన నర్సరీలలో నాణ్యమైన మామిడి మొక్కలు, అలంకరణ మొక్కలు నామమాత్రపు ధరలకే అందుబాటులో ఉన్నాయని పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, మంచిర్యాల జిల్లా భీమారం, బెల్లంపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగా ఉద్యాన నర్సరీలలో ఆయా మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి మొక్క రూ.50, క్రోటాన్స్, అలంకరణ మొక్కలు రూ.20, మునగ, కరివేపాకు మొక్కలు రూ.20 చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులకు, రైతు సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు విక్రయించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇంకా ఇతర రకాల మొక్కలు అవసరమున్నట్లయితే ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఇంకా ఇతర రాకల మొక్కలు అవసమున్నట్లయితే ఉత్పత్తి చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఉద్యాన అధికారిని 9032313933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి 2024 సంవత్సరానికి గానూ భారత ప్రభుత్వం పాఠశాల విద్య, అక్షరాస్యత మంత్రిత్వ శాఖ శాస్త్రీ భవన్, న్యూఢిల్లీ వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం https:// nationalawardstoteachers. education. gov. in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణకు నేడే ఆఖరు

ఆదిలాబాద్‌రూరల్: సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్ 2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష కోసం అందించనున్న ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియనుందని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసై ఆసక్తి కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 7న ఆన్‌లైన్ ద్వారా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన వారికి 18 నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలన్నారు.

పడవ ప్రయాణమే దిక్కు



పడవ సాయంతో నది దాటుతున్న ప్రయాణికులు

- ప్రాణహితపై సరిహద్దు కష్టాలు

వేమనపల్లి: ఇక నుంచి ప్రాణహిత నదిలో పడవ ప్రయాణమే దిక్కయ్యింది. గత చలికాలం నుంచి ప్రాణహిత నదిలో వరద తగ్గి సరిహద్దు కాలినడక (సాచ్చిరేవులు) ద్వారా రాకపోకలు కొనసాగేవి. 15 రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నదిలోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో కాలినడకన దాటిన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేమనపల్లి పుష్కరఘాట్, రేగుంట, ముక్కిడిగూడెం, కళ్లంపల్లి, కోటపల్లి మండలం ఎంచపల్లి, కుమురంభీం జిల్లాలోని బెజ్జూర్, దహెగాం మండలాల పరిధిలోని సరిహద్దు గ్రామాల వద్ద పడవ ప్రయాణం మొదలైంది. ఏడాదిలో ఏడు నెలల వరకు పడవల ద్వారానే ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఒక్కో మనిషి పడవతో దాటేందుకు రూ.100 నుంచి రూ.200ల వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

వంతెన చింత

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నదిపై దిగువన కోటపల్లి మండలం రాపనపల్లి వద్ద ఎగువన కొటాల మండలం గూడం వద్ద మాత్రమే వంతెనలు ఉన్నాయి. సుమారు 200 కిలోమీటర్ల నదీ ప్రవాహం పొడవున బెజ్జూర్, దహెగాం, వేమనపల్లి, కోటపల్లి సరిహద్దు మండలాల పరిధిలో మరెక్కడా వంతెన లేదు. దీంతో నది అవతలి వైపునకు రావాలంటే వంతెనలు లేక పడవ ప్రయాణం లేకుంటే దూరభారం తప్పడం లేదు. నది అవతలి వైపు ఉన్న గడ్చిరోలి జిల్లా సిరోంచ, అహెరి తాలూక పరిధిలో సుమారు 74 గ్రామాలకు తెలంగాణ వైపు ఉన్న కుమురంభీం, మంచిర్యాల జిల్లాల గ్రామాలకు రాకపోకల కష్టాలు ఎక్కువే. సిరోంచ అహెరి తాలూకా గ్రామాలు ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ పాలిత ప్రాంతాలే కావడంతో వీరంతా మొదటి నుంచి మరాఠీ కాకుండా తెలుగు భాషలోనే మాట్లాడుతుంటారు. సరిహద్దులో నదీ తీరం వెంట గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. వంతెన నిర్మాణం లేక రాకపోకలకు పడవ ప్రయాణం తప్పడం లేదు. ఏడు నెలలు ప్రమాదమైనా నాటు పడవలకు అధిక చార్జీలు వెచ్చించి రాకపోకలు సాగిస్తున్నారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు హామీలకే పరిమితమైపోతున్నాయి.

జవాన్‌గా.. జానపద కళాకారుడిగా..!

- గీతాల రూపకల్పనలో తనదైన శైలి
- సమాజాన్ని చైతన్య పరుస్తున్న శేఖర్

> బాల్యం నుంచే రచనలు.. పాటలు పాడుతూ..నటిస్తూ రాణిస్తున్నాడు కుంటాల మండలంలోని మెదన్‌పూర్ గ్రా మానికి చెందిన దర్శనం శేఖర్. జవాన్‌గా దేశసేవ చేస్తూ సెలవుల్లో వచ్చినప్పుడు ఇంటికి వచ్చినప్పుడల్లా సమాజంలోని మా ర్పులకనుగుణంగా తన కళలతో ప్రజలను చైతన్య పరుస్తున్నాడు. – కుంటాల



దర్శనం శేఖర్ రూపొందించిన సీడీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

చిన్ననాటి నుంచి కళలపై మక్కువ..

కుంటాల మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన దర్శనం పీరాబాయి–పోశెట్టి దంపతుల రెండో కుమారుడు దర్శనం శేఖర్. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశాడు. పాఠశాలలో స్వాతంత్ర్య, గణతంత్ర, వార్షికోత్సవాల్లో భాగంగా తనకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. తాను రచించిన పాటలు పాడుతూ.. నటిస్తూ అందరి దృష్టి ఆకర్షించాడు. దేశభక్తి, జానపద పాటలు రాసి తనదైన ప్రత్యేకతను చాటుకున్నాడు. 2010లో ముంబైలో నిర్వహించిన ఎన్‌సీసీ జాతీయ సదస్సులో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి అప్పటి కల్నల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కరీంనగర్‌లో స్వర్ణ పతకం సాధించారు. అమ్మా నీరూపమా.. ఆల్బమ్ ద్వారా పేరు సంపాదించి.. ఆకాశవాణిలో పాడిన పాటలకు శ్రోతల మెప్పు పొంది గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రముఖ గాయకుడు అంజయ్య స్ఫూర్తితో రచయితగా గుర్తింపు పొందాడు. 2012లో బీఎస్సీ పూర్తిచేసిన ఆయన ఆర్మీలో ఉద్యోగం సంపాదించాడు. ఆర్మీలో నర్సింగ్ టెక్నీషియన్‌గా చండీగఢ్, ఉదంపూర్, డెహ్రాడూన్‌లో వైద్య సేవలు అందిస్తూ ప్రస్తుతం పూణేలో విధులు నిర్వర్తిస్తున్నారు. 'గల్లు..గల్లుమన్నా.. నీచేతిగాజులు' సీడీని మాజీమంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అమ్మా నీ రూపమా.. గుండెకు గుచ్చిన.. గాయం నువ్వేనా.. లవ్ ఫెయిల్యూర్.. చంపేస్తుంది నన్ను.. ఇలాంటి 3 వేలకు పైగా సీడీలు రూపొందించారు. తెలంగాణ ఉద్యమంలో తన గొంతుకను వినిపించి ఉద్యమకారులను చైతన్య పరిచారు. పల్లెల్లోని వాతావరణం, సంప్రదాయం, దేశభక్తితో సమాజాన్ని ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ అన్నీతానై రాణిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ప్రత్యేకత చాటాలని...



చిన్నప్పటి నుంచి పాటలు పాడడం, రాయడం, నటించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. నన్ను అందరూ ప్రోత్సహించారు. దేశసేవ చేస్తూ జరుగుతున్న పరిస్థితులపై సీడీల ద్వారా రూపొందించడంతో అభిమానులు ఆశీర్వదించారు. ప్రత్యేకత ఉండాలని నిరంతరం కృషి చేస్తున్నా.

– దర్శనం శేఖర్, ఆర్మీ జవాన్

ఆర్వో ప్లాంట్‌కు మోక్షమెప్పుడో?

- 3 నెలలుగా అలంకారప్రాయంగానే..
- ఇప్పటికీ ప్రారంభించని అధికారులు



నస్పూర్ షిర్కే చౌరస్తాలోని ఆర్వో వాటర్ ప్లాంట్ కేంద్రం

శ్రీరాంపూర్: అసలే వర్షాకాలం. ఈ సీజన్‌లో ఎక్కువగా తాగునీరు కలుషితం కావడంవల్లే జబ్బులు వస్తాయి. కాబట్టి వర్షాకాలంలో పరిశుద్ధమైన నీటినే తాగాలని సింగరేణి వైద్యులు చెబుతుంటారు. ఇంతగా అవగాహన కల్పిస్తున్న కంపెనీ అధికారులు కాలనీ వాసులకు పరిశుద్ధమైన తాగునీరందించేందుకు ఏర్పాట్లు చేసి కూడా నీళ్లు ఇవ్వడం లేదు. నస్పూర్ షిర్కే చౌరస్తాలో సింగరేణి సంస్థ సుమారు రూ.10 లక్షలతో ఆర్వో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. శ్రీరాంపూర్‌లో ఏరియాలో కృష్ణా కాలనీ, నస్పూర్ కాలనీలో ఇప్పటికే ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరందిస్తున్నారు. నస్పూర్ కాలనీ పెద్దది కావడంతో షిర్కే చౌరస్తాలో మరో ప్లాంట్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. దీని నిర్మాణం, ప్లాంట్‌లో ప్యూరిఫికేషన్ సిస్టం మొత్తం కూడా 3 నెలల క్రితమే పూర్తయ్యింది. అయితే పార్లమెంట్ ఎన్నికల కారణంగా దాన్ని ప్రారంభించకుండా ఆపారు. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సివిల్ అధికారులు ప్లాంట్‌ను ప్రారంభించలేదు. దీంతో 3 నెలలుగా అలంకరప్రాయంగా మారింది.

ఎన్నికలతో జాప్యం...

ఎన్నికల పేరుతో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని ఇకనైనా ఆలస్యం చేయకుండా వెంటనే వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే వర్షాకాలం మొదలైంది. గోదావరి నుంచి వచ్చే నీరు కూడా వరదలు వస్తే రంగుమారి వస్తుంటాయి. గత సీజన్‌లో మురికి నీరు వచ్చి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉన్న ప్లాంట్‌ను తెరిపించకుండా అధికారులు జాప్యం చేయడంపై కార్మిక కుటుంబాలు మండిపడుతున్నాయి. ముఖ్య అధికారుల చేతుల మీదుగా ప్రారంభించడం కోసమే ఏరియా సివిల్ అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సివిల్ ఈఈ సత్యనారాయణను సంప్రదించగా ఉన్నతాధికారులతో మాట్లాడామని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

వెంటనే ప్రారంభించాలి

కార్మిక కుటుంబాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను వెంటనే ప్రారంభించాలి. అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదు. వెంటనే ప్లాంట్‌ను ప్రారంభించి కాలనీ వాసులకు శుద్ధమైన నీటిని అందించాలి.

– పెట్టం లక్ష్మణ్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు